# హల్లికి హల్లి...

ఆంధ్రప్రదేశ్ ఏర్పడేనాటికి రామదాసు వయస్సు రెండు సంవత్సరాలకు కాస్తో కూస్తో తక్కువ. అంతకు మూడు నాలుగు మాసాలకిందటే, రామదాసు తండ్రి కాలం చేశాడు. వెంకయ్య చనిపోయిందాకా నాగమ్మ బస్తీ ముఖం ఎరగదు.

వెంకయ్య రాళ్ళు కొట్టి బతుకుతుండేవాడు. ఉదయమనంగా, సరంజామా సంచిని భుజం మీద వేసుకొని గుట్టమీది కెడితే, కను చీకటి పడిగాని ఇంటికొచ్చేవాడు కాదు. అలా రెండు మూడేళు ్ళ, వాళ్ళసంసారం సుఖంగానే గడిచింది. ఒక రోజు మధ్యాహ్నం వేళ గుడిసె ముందు జనం కేకలు విని, తడికతోసుకుని బయటకొచ్చింది నాగమ్మ. మొగుడు నెత్తురు ముద్దలా వున్నాడు. కుప్పకూలిపోయింది నాగమ్మ.

జరిగిందేమిటంటే...

నిన్న సాయంకాలం చుట్టును పగలగొట్టడానికి వెంకయ్య రంధ్రం తొలిచి వచ్చాడు. ఇవ్వాళ ఉదయం "రాత మందు"ను బెజ్జంలో వేసి మెల్లిగా కూరుతున్నాడు వెంకయ్య. ఏం పొరబాటు జరిగిందో, ఎలా జరిగిందో తెలీదు. బ్రహ్మాండమైన ప్రేలుడుతో బాటు, వెంకయ్య, అంతెత్తుకు ఎగిరిపడి, నెత్తురు ముద్దకిందమారిపోయాడు...

అప్పణ్నించే నాగమ్మ కష్టాలు ప్రారంభమయ్యాయి. కొంత కాలం కూలీనాలీ చేసి బిడ్డను పోషించుకొంది. ఆ కూలీ పనులైనా ఏటెల్లపాదీ ఉండేవి కావు. పని పాటూ లేనప్పుడు కటికి పస్తు చేసింది. కానీ కొడుకును మాత్రం పస్తులుంచలేదు.

మరింక ఆ ఊళ్ళో ఉండలేక బతుకుదామని గుంటూరు వచ్చింది. అరండల్ పేటలో ఉన్న ఓ డాక్టరుగారింట్లో ఇంత నీడను సంపాదించుకొంది. క్రమక్రమంగా నాలుగైదు ఇళ్ళల్లో పనిపాట్లు దొరికాయి. ప్రతిరోజు ఇద్దరు ముగ్గురు తల్లులైనా, ఇంత అన్నం, ఇన్ని కూరలు గిన్నెల్లో వదిలేసేవారు.

"అట్టనే నా బిడ్డను సాక్కున్నానండీ! ఆ తరువాత ఆ డాకటేరుగారే పుణ్యం కట్టుకొని, నాకు మంగళగిరి రోడ్డు మీదున్న వో పుగాకు కంపెనీలో గేడింగు పని ఇప్పించారు" అన్నది నాగమ్మ ఆ డాక్టరుకు చేయెత్తి దణ్ణం పెడుతూ.

ఇలా ఏడెనిమిది సంవత్సరాలు జరిగాయి. ఈ మధ్య కాలంలో, రామదాసును చదివింతామని, నాగమ్మ చాలా శ్రమపడింది. అదేం గ్రహచారమోగానీ, రామదాసుకు మిగిలిన లక్షణాలన్నీ అబ్బాయిగానీ అక్షరం మాత్రం అంటలేదు.

అతను రోజంతా జులాయిగా తిరిగేవాడు. గోలీలాడేవాడు. బిళ్లంగోడు ఆడేవాడు. గాలిపటాలు ఎగరేసేవాడు. సినిమాలు తెగ చూసేవాడు. ఇష్టమయినప్పుడు, యింటికొచ్చేవాడు లేనప్పుడు ఏ గాంధీ పార్కులోనో, ఏ హొటలు ముందో పడుకొనేవాడు.

"ఓసారి ఆంధ్రరత్న భవనం హొటల్లో దూరి తిన్నాను, ఇవ్వడానికి డబ్బులేదు. పారిపోయాను. నన్ను పట్టుకొని చావబాదారు. ఆ రోజంతా, ఆ హొటల్లో కప్పులు కడిగాను" అన్నాడు రామదాసు, కిందపెదవిని సుతారంగా కొరుక్కుంటూ.

''గుంటూరు టౌన్ మొత్తం మీద నాకు తెలియని బజారుగానీ, గొందిగానీ లేదు సారు. కళ్ళు మూసుకొని నడిచినా, నేను బజార్లు గుర్తు పడతాను'' అన్నాడు రామదాసు.

రాను రాను అతని తిరుగుడు హెచ్చింది. తిరుగుడుతోబాటు ఆ బాపతు కుర్రసజ్జుతో సావాసాలు కూడా పెరిగాయి. అతని స్నేహితుల్తో చిల్లర దొంగతనాలు చేసేవారు కూడా ఉన్నారు. మొదట మొదట్లో రామదాసుకు ఆ పని చేయడమంటే చాలా భయంగా ఉండేది. కానీ, చుట్టు ఉన్న వాళ్ళంతా కలసి, అతని భయాన్ని పోగొట్టారు.

''చాల పాడుపనులు చేసేవాళ్ళమండీ! హొటల్లో దూరి, చెంచాలు కాజేసేవాళ్ళం, గుడ్డి బిచ్చగాళ్ళ దగ్గర కొట్టేసేవాళ్ళం. ఒకసారి ఓ పెద్ద మనిషి రత్నా టాకీసు దగ్గర టిక్కెటు తెచ్చి పెట్టమని రూపాయి నోటు ఇచ్చాడు. నేల టిక్కెట్లిచ్చే కిటికి దగ్గర బ్రహ్మాండమైన గలాటా, నేను సరేనని రూపాయి తీసుకుని పారిపోయాను''అన్నాడు రామదాసు సిగ్గుపడుతూ.

రాను రాను ఈ 'చేవాటు' వ్యవహారం బాగా ముదిరింది.

''ఒకసారి నేను జిన్నాటవర్‌కు ఎదురుగా వున్న లైబ్రరీలో పడుకొన్నాను. నాలాంటి జనం ఇంకా చాలా మంది పడుకొని ఉన్నారు. చచ్చేంత చలి, గజగజ లాడిపోతున్నాను. నాప రాళ్ళు ఈకువెక్కి జిమ్ము మంటున్నాయి. అంతలోనే ఏవో పరుగులూ, ఉరుకులూ, కేకలూ, అల్లరీ అంతా లేచాం- పోలీసులు లాఠీలతో బాదుతూ మమ్మల్ని లేపారు. అందర్నీ సోదా చేశారు. నేను పడుకున్న చోట పర్సు కనిపించింది. అప్పుడు నన్నుకొట్టిన దెబ్బలు నా జన్మలో తినలేదండీ! ఆ పర్సు ఎవరిదో, ఎవరు తెచ్చి నా పక్కన పడేశారో నాకు తెలీదు. నేను నిజాయితీ పరుణ్ని కాదుగానీ - పర్సులు కొట్టేంత 'ఊకం' నాకు లేదండీ! ఆ పని నేను చెయ్యలేదు'' అన్నాడు రామదాసు.

అయినా అతనికి జైలు శిక్ష తప్పలేదు. జైలంటే మరేంలేదు - అతన్ని గుంటూరు నుండి హైదరాబాదుకు మార్చారు. అలా మార్చటానికి ముందు, తల్లి, రెండు మూడుసార్లు పోలీసు స్టేషనుకొచ్చి లబోదిబోమని ఏడ్చింది. చిత్రమేమిటంటే, తను నేరం చెయ్యలేదని, రామదాసు నిరూపించుకోలేకపోయాడు. రామదాసే దొంగతనం చేస్తుండగా పట్టుబడినట్టు పోలీసులు సాక్షాధారాలతో సహా రుజువు చేశారు.

రామదాసు బాలనేరస్థుల కేంద్రంలో గడిపినప్పుడు, కొంతలో కొంత, క్రమశిక్షణను అలవరచుకున్నాడు. అంతో ఇంతో చదువు కూడా అబ్బింది. రెండు మూడు రకాల చేతి పనులు కూడా అక్కడ నేర్చుకొన్నాడు.

''అయితే అవేవీ నాకు పిడికెడు అన్నం పెట్టలేదు సార్. మళ్ళీ గుంటూరు వెళ్ళడం నాకిష్టంలేదు. అందుకని ఇక్కడే ఉన్నా. కొంత కాలం , బస్సు డిపో దగ్గరా, నాంపల్లి రైల్వేస్టేషన్‌లోనూ, మూటలు మోసా. ఆ తరువాతనే ఈ పనిలోకి దిగా. మా అమ్మను కూడా తీసుకొచ్చా'' అన్నాడు రామదాసు.

అతను 'శిర్‌మాలిష్' చేస్తాడు. గుబిలి తీస్తాడు. సుతారంగా మెడనరాలు విరుస్తాడు. నొప్పితగలకుండా చెవుల్ని సాగదీసి, 'కిరకిర' మనిపిస్తాడు. చేతివేళ్ళను. సుఖంగా విరిచి, ఫెళఫెళ మనిపిస్తాడు.

''ఈ శిర్‌మాలిష్ కొకరేటు అంటూ ఏదీ లేదు సార్.పావలా దగ్గర్నించి ముప్పావలా దాకా

గుంజుతాను. పావలాకు వాడే నూనె వేరు, ముప్పావలాకు వాడే నూనె వేరు. కాస్త సువాసన నూనె కలుపుతాను. పది నిమిషాలపాటు మాలిష్ చేస్తాను. శుభ్రంగా తల దవ్వుతాను. మరీ అన్యాయంగా తింటే అరగాలికదా సార్'' అన్నాడు రామదాసు.

ఇంతకన్నా గుబిలి తీయడంలోనే తనకు బాగా గిట్టుబాటు అవుతుందన్నాడు రామదాసు. మామూలుగా గుబిలితీస్తే పదిపైసల్నించి పావలా దాకా తీసుకొంటాడు. కానీ, కొంతమంది చెవుల్లో 'రాళ్లు' ఉంటాయట. మనిషిని బట్టీ, వాడి ధోరణిని బట్టి, చెవుల్లో ఉండేరాళ్ల సంఖ్యకూడా మారుతుంటుందన్నాడు రామదాసు.

''మరీ మీరంత రింగరీజన్లన్నీ తీయకండి - చెవుల్లో రాళ్లుంటాయ్యా! అంటే ఉంటయ్ ఒకో రాయికి పావలాకు తక్కువ తీసుకోను.  కావాలంటే, రాయిని పించర్‌తోనూ, గుబిలి తెడ్డుతోనూ, టక్ టక్‌మనిపించుతా కూడా! రాయితీశానని, అరచేతిలోపెట్టాకనే డబ్బుతీసుకుంటాను'' అన్నాడు రామదాసు నవ్వుతూ- ఇది మోసం కాదనీ, ఈ పాటి దగా కూడా చేయకుండా బతకలేకపోతున్నాననీ రామదాసు వాదించాడు.

''లోకంలో లక్ష మోసాలు జరుగుతున్నాయి. వాళ్ళందరికన్నా నా మోసం పెద్ద దేం కాదులేండీ'' అని తనను తాను సమర్థించుకొన్నాడు రామదాసు.

అతనితకింకా పెళ్ళికాలేదుట. చేసుకోవాలని కూడా లేదుట. రోజు ఎంత హీనంగా చేసుకొన్నా అయిదారు రూపాయలు సంపాదిస్తాడుట. అంతకన్నా ఎక్కువ గిట్టుబాటు అయిన రోజున 'మందు' కొడతాడుట. తల్లికి మాత్రం ఏ లోపం రాకుండా చూస్తున్నానన్నాడు.

''ఇక్కడ అక్కడా అన్నదేమీ లేదు సార్. ఊరంతా తిరుగుతా. హొటళ్ళు, పార్కులూ, ఇస్సుస్టాండ్లు, రైలు స్టేషన్లు, ఎక్కడ గిరాకీ ఉంటే అక్కడే!'' అన్నాడు రామదాసు.

రోజంతా తిరుగుతూ ఉండే రామదాసు ఇంతవరకూ కూడబెట్టిందేమీ లేదు. ఎప్పుడన్నా మూడో నాలుగో మందు కొట్టాక కూడా మిగిలితే, సినిమాలు చూస్తాడు.

''ఊపిరున్నంతకాలం జల్సాగా తిరుగతా, చచ్చాననుకోండి ఊళ్ళో ఉంచరు. ఎవరో వొకరు లాగి అవతల పడేస్తారు'' అన్నాడు రామదాసు హాయిగా నవ్వుతూ.

జీవితం పట్ల, అంత నిర్మలత్వంగా ఉండడం అందరకూ సాధ్యమేనా?